క్లుప్తంగా

అందుబాటులో శనగ విత్తనాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ తెలిపారు. తాడ్వాయి సింగిల్ విండో కార్యాలయంలో 500 క్వింటాళ్లు, దేమికలాన్ సింగిల్ విండో కార్యాలయంలో 100 క్వింటాళ్ల శనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. 25 కిలోల సంచిని రూ.1,875 చొప్పున విక్రయించనున్నట్లు తెలిపారు. రైతులు తమ పట్టాపాస్ పుస్తకాల జిరాక్స్‌లతో రావాలన్నారు.

పద్మాజీవాడిలో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి): పద్మాజీవాడి సింగిల్ విండో కార్యాలయంలో శనగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు విండో చైర్మన్ గంగాధర్, సీఈవో దేవేందర్‌లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విధుల్లోకి ఆశావర్కర్లు



రాజంపేట: హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు, ఆశా యూనియన్ (సీఐటీయు) ఆదేశాల మేరకు మంగళవారం తాత్కాలికంగా సమ్మెను విరమిస్తూ విధుల్లోకి చేరుతున్నట్లు రాజంపేట ఆశావర్కర్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజంపేట మెడికల్ ఆఫీసర్ విజయ మహాలక్ష్మికి విధుల్లోకి చేరుతున్నట్లు లేఖ అందజేశారు.

గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడిగా పంపరి శ్రీనివాస్



కామారెడ్డి అర్బన్: తెలంగాణ గంగపుత్ర సంఘం(సంప్రదాయ మత్స్యకారుల మాతృసంస్థ) జిల్లా అధ్యక్షుడిగా కామారెడ్డికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పంపరి శ్రీనివాస్‌ను రాష్ట్ర అధ్యక్షుడు చీటి మల్లయ్య నియమించారు. రాజకీయంగానే కాకుండా గంగపుత్రుల కుటుంబాలతో ఉన్న అనుబంధం, వారి సంక్షేమానికి చేస్తున్న కృషిని గుర్తించి పంపరి శ్రీనివాస్‌ను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్టు చీటి మల్లయ్య పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, పంపరి శ్రీనివాస్‌ను సన్మానించి అభినందించారు. సంఘం నాయకులతో పాటు ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబోద్దీన్, మాచారెడ్డి ఎంపీపీ ఎల్. నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు ఎం.అంజయ్య, నల్లవెల్లి అశోక్, నిమ్మ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

బిచ్కుంద(జుక్కల్): విద్యార్థులు లక్ష్యంతో ముందుకు వెళ్తే అనుకున్నది సాధించవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర ముఖర్జీ అన్నారు. మంగళవారం కళాశాలలో ఫ్రెషర్స్ డే పార్టీ నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.

బీఆర్ఎస్‌కు గిరిజనుల మద్దతు



నిజాంసాగర్(జుక్కల్): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటేస్తామని పిప్పిరేగడి తండా గిరిజనులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు మంగళవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజుకు తీర్మాన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గంగారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు హరీష్, రాములు తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ

మద్నూర్(జుక్కల్): మద్నూర్, డోంగ్లీ మండలాలకు బదిలీపై వచ్చిన ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. మద్నూర్ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భరత్, బిచ్కుంద తహసీల్ నుంచి బదిలీపై వచ్చారు. డోంగ్లీ డిప్యూటీ తహసీల్దార్‌గా రాచప్ప బాధ్యతలు తీసుకున్నారు. అదే కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రమోషన్ వచ్చింది.

ఘనంగా సంప్రోక్షణ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో మంగళవారం ఘనంగా సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇటీవల ఆలయ పూజారి పండరీనాథ్ మహారాజ్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. జపాన్ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో వందలాది భక్తుల మధ్య సంప్రోక్షణ కార్యక్రమం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిపించారు. భక్తులకు అన్నదానం చేశారు. సర్పంచ్ సంజీవులు, వైస్ ఎంపీపీ నర్సింలు, తదితరులు హాజరయ్యారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు

- బీర్కూర్‌లో పిచ్చి కుక్కల దాడిలో పలువురికి గాయాలు
- స్వైర విహారం చేస్తున్నా పట్టించుకోని యంత్రాంగం





ఇటీవల కుక్కల దాడిలో గాయపడిన నారాయణ

బాన్సువాడ: వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఒక పక్క నియంత్రణకు మున్సిపల్, పంచాయతీ అధికారులు చర్యలు చేపడుతున్నా ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తూ చుక్కలు చూపిస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులపై కుక్కలు దాడులు చేస్తున్నాయి. కుక్కల గుంపు ఉన్న ప్రాంతం మీదుగా పాదచారులు, వాహనదారులు వెళ్లాలంటే భయపడుతున్నారు. రాత్రి వేళ వాహనాల వెంట పడడం, పాదచారులు వెళ్తుంటే వారిపై దాడికి పాల్పడటం చేస్తున్నాయి. రోజురోజుకు కొత్తగా కుక్క పిల్లల సంఖ్య పెరిగి ఏ వీధిలో చూసినా గుంపుగా కనిపిస్తున్నాయి. మూడు రోజుల క్రితం బీర్కూర్ రంగాజీనగర్ కాలనీలో ఐదేళ్ల సోనిని, ఆరేళ్ల వర్షిత్‌ను, మజీద్ గల్లీలో 70 ఏళ్ల వృద్ధుడు విశ్వరాప్పలపై పిచ్చి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అదే రోజు బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్‌లో ఇద్దరు వృద్ధులను గాయపరిచాయి. బైరాపూర్‌లో కమ్మరి నారాయణ అనే వృద్ధుడిపై కుక్కలు దాడి చేయడంతో కన్నుపై తీవ్ర గాయమైంది. రెండేళ్లుగా బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో కుక్కల సంఖ్య భారీగా పెరగడం, దాడులకు దిగుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధులు, పట్టణ వాసులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులు, పాలకవర్గాన్ని కోరారు.

ఏ వీధి చూసినా కుక్కలే..

బాన్సువాడ పట్టణంలో పలు ప్రాంతాల్లో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. ఒక్క కుక్క అరిస్తే చాలు మిగిలిన కుక్కలన్నీ అక్కడకు చేరి అరుస్తుండడంతో పాదచారులు భయపడుతున్నారు. కొన్ని సార్లు విచక్షణారహితంగా దాడులు చేస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు ఆయా ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల నుంచి స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా వీధి కుక్కలను నియంత్రించే చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

రామారెడ్డి (ఎల్లారెడ్డి): మద్దికుంట గ్రామంలో కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. బాధితుడు భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతిచెందినట్లు పేర్కొన్నారు. సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.



మృతి చెందిన గొర్రె పిల్లలు

ఎరుకలకు 2 ఎకరాల స్థలం కేటాయించండి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి పట్టణ, మండలానికి చెందిన ఎరుకల కులస్తుల కోసం పట్టణ శివారులో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని తెలంగాణ ఎరుకల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎరుకల సాధికారత పథకం ద్వారా పిగ్ బ్రీడర్స్ కో–ఆపరేటివ్ సొసైటీకి స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, జిల్లా అధ్యక్షుడు రాములు ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రభుత్వాస్పత్రి సిబ్బందికి వేతనాలిప్పించాలి

- దోమకొండ సర్వసభ్య సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను కోరిన సభ్యులు

దోమకొండ: ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని, ఈ విషయంలో చొరవ చూపి వేతనాలు అందేలా చూడాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్ సంగీత్ కుమార్‌ను కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కానుగంటి శారద అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, దోమకొండ సర్పంచ్ నల్లపు అంజలి తదితరులు ఆస్పత్రి సూపరింటెండెంట్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పండుగలు ఉన్నాయని, ఈ విషయంలో కాంట్రాక్టర్‌తో మాట్లాడి వారికి వేతనాలు ఇప్పించాలని కోరారు. అనంతరం వివిధ అంశాలపై సంబంధిత శాఖ అధికారులు మాట్లాడారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బాపురెడ్డి, భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్‌లు నాగరాజ్‌రెడ్డి, తిరుపతిగౌడ్, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ సంజయ్‌రావ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

పండుగ పూట పస్తులు ఉండాలా ?

కామారెడ్డి టౌన్: పండుగల పూట పస్తులు ఉండాలా అని కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రి కార్మికులు వాపోయారు. తమకు రావాల్సిన 4 నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్ర ఆస్పత్రి ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.దశరత్ మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్మికులు లక్ష్మి, సునీత, తదితరులున్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

బీజేపీ ఆధ్వర్యంలో మట్టి సేకరణ

బాన్సువాడ: మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాన్సువాడలో బీజేపీ నాయకులు మట్టిని సేకరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పైడిమల్ లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ.. బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి మట్టిని సేకరిస్తున్నామని, దేశ వ్యాప్తంగా సేకరించిన మట్టిని దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల స్తూపాన్ని నిర్మించనున్నారని అన్నారు. మట్టి సేకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. నాయకులు కొత్తకొండ భాస్కర్, హన్మాండ్లు, కోనాల గంగారెడ్డి, శంకర్‌గౌడ్, చీకట్ల రాజు, కిషన్, గంగారం, భాస్కర్ రెడ్డి, తదితరులున్నారు.



మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

ఓటు ద్వారా మంచి నాయకులను ఎన్నుకోవాలి

కామారెడ్డి టౌన్: ఓటు ద్వారానే మంచి నాయకులను ఎన్నుకోవాలని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ కె. చంద్రశేఖర్ అన్నారు. విద్యార్థి, నిరుద్యోగ యువతలో ఓటు చైతన్యం కోసం చేపట్టిన 33 జిల్లాల చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం జిల్లాలో నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులు, నిరుద్యోగులతో మాట్లాడారు. ఓటు ద్వారా రాజకీయాలను మార్చాలని, విలువలతో కూడిన రాజకీయ నేతలను ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ, ఐటీ సెల్ ఇన్‌చార్జి రవితేజ, ప్రవీణ్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రచార ఫ్లెక్సీల తొలగింపు



దుర్కిలో ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది



రాజంపేటలో ..

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో అధికారులు ఎన్నికల కోడ్‌ను అమలు చేస్తున్నారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రధాన రహదారులపై రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, క్యాలెండర్లు, ఇతర కరపత్రాలు, జెండాలను తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలను తీసివేశారు. జాతీయ నాయకుల విగ్రహాలకు మాస్కులు వేశారు. – సాక్షి నెట్‌వర్క్



బాన్సువాడలో జెండాలను తొలగిస్తూ..



ఎల్లారెడ్డిలో పెయింటింగ్‌లను చెరిపేస్తూ..



తాండూర్‌లో..



కృష్ణాజీవాడిలో విగ్రహాలకు ముసుగులు

పోలింగ్ కేంద్రాలను జోనల్ ఆఫీసర్లు పరిశీలించాలి



ఎల్లారెడ్డి: ప్రతి పోలింగ్ కేంద్రాన్ని జోనల్ ఆఫీసర్లు పరిశీలించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఎలక్షన్ జోనల్ ఆఫీసర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రంలో ర్యాంపు, విద్యుత్, టాయిలెట్లు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించాలని సూచించారు. డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు సురేష్, సుధాకర్, ఎస్సైలు, జోనల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో శరన్నవరాత్రులకు ఏర్పాట్లు



మద్నూర్(జుక్కల్): దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల కోసం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వాహకులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దేవి నవరాత్రులను ఈసారి అంగరంగ వైభవంగా నిర్వహించాలని భక్తులు మండపాలను సిద్ధం చేస్తున్నారు. నిజామాబాద్, నాందేడ్ పట్టణాల్లో దుర్గామాత విగ్రహాలను బుకింగ్ చేసుకున్నామని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో ఒకరికి మించి మరొకరు పోటీగా భారీ సెట్టింగ్‌లు వేస్తుండడంతో సందడి నెలకొంది.

రేషన్ బియ్యం కోసం ఆందోళన



రాంపూర్‌లో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

పిట్లం(జుక్కల్): రేషన్ బియ్యం కోసం పిట్లం – బాన్సువాడ రహదారిపై రాంపూర్‌లో గ్రామస్తులతో కలిసి సర్పంచ్ నారాయణరెడ్డి మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని రేషన్ షాప్‌నకు 20 నెలల నుంచి లబ్ధిదారుల కంటే రేషన్ బియ్యం తక్కువగా వస్తున్నాయని, దీంతో లబ్ధిదారులకు బియ్యం సక్రమంగా పంపిణీ కావడం లేదన్నారు. కొంతమంది ఇతర గ్రామాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

బీబీపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



బీబీపేటలో మాట్లాడుతున్న సభ్యులు

బీబీపేట: బీబీపేట మండల కేంద్రాన్ని ప్రభుత్వం వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని రెవెన్యూ డివిజన్ సాధన సమితి సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నందున బీబీపేట చరిత్ర పూర్తిగా ఆయనకు అవగాహన ఉన్నందున ప్రజల కోరిక మేరకు రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరారు. అంతే కాకుండా భవిష్యత్తులో అన్ని గ్రామాల ప్రజల మద్దతుతో రెవెన్యూ డివిజన్ కోసం ఉద్యమం చేస్తామన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న డీపీఎం రమేశ్‌బాబు

రాజంపేట: ఐకేపీ సంఘాలను బలోపేతానికి కృషి చేయాలని ఐకేపీ డీపీఎం రమేష్‌బాబు అన్నారు. మంగళవారం వీవోలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. బ్యాంకు, స్త్రీనిధి రుణాలతో వ్యాపారాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మేకలు, గొర్రెలు, చేపల పెంపకం, టెంట్ హౌజ్ ఏర్పాటు వంటి వ్యాపారాలు చేసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఆర్గోండ వీవో పరిధిలో టైలరింగ్, మగ్గం శిక్షణ ఇవ్వనున్నామని, ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఏపీఎం సాయిలు, సీసీ సాయిలు, అధ్యక్షులు లలిత, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఒక్కసారి గెలిపించండి

బాన్సువాడ రూరల్: మండలంలోని తాడ్కోల్‌లో మంగళవారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని ఒక్కసారి గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే నెలకు రూ.4వేల పింఛన్, ప్రతి మహిళకు రూ.2500 జీవన భృతి, వంటగ్యాస్ సిలిండర్ రూ.500 కే అందజేస్తుందన్నారు. రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. కిసాన్ ఖేత్ జిల్లా అధ్యక్షుడు ఉద్దర హన్మాండ్లు, బాన్సువాడ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



హెచ్‌ఎంలను సన్మానిస్తున్న టీపీటీఎఫ్ నేతలు

కామారెడ్డి టౌన్: పదోన్నతులు పొందిన ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కె.వేణుగోపాల్ కోరారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హెచ్‌ఎంలను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. టీపీటీఎఫ్ సీనియర్ నాయకుడు హన్మండ్లు, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు.. తనిఖీలు ముమ్మరం



పోచారం చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



బిచ్కుందలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై మురళి

నాగిరెడ్డిపేట/నస్రుల్లాబాద్/బిచ్కుంద: ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో జిల్లా సరిహద్దులోని నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం వద్ద, నస్రుల్లాబాద్‌లోని అటవీ ప్రాంతానికి సమీపంలో మంగళవారం పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. జిల్లాలోకి వచ్చిపోయే ప్రతివాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అక్రమంగా డబ్బు, మద్యం రవాణా జరగకుండా చర్యలు చేపడుతున్నారు. ఎన్నికలు ముగిసే వరకు చెక్‌పోస్టులు కొనసాగుతాయని వారు తెలిపారు.

సంక్షిప్తం

జీపీ భవన నిర్మాణ పనుల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పల్లెబోగుడతండాలో జీపీ భవన నిర్మాణ పనులను మంగళవారం స్థానిక ఎంపీడీవో రఘు పరిశీలించారు. పనులను నాణ్యతతో చేపట్టాలని ఆయన సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సునంద ఉన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): గ్రామాలలో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీవో ప్రకాష్ సూచించారు. మంగళవారం మీసాన్‌పల్లి జీపీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ తదితరులున్నారు.

డెయిరీ కళాశాలలో స.హ. చట్టం వారోత్సవాలు

కామారెడ్డి అర్బన్: స్థానిక డెయిరీ టెక్నాలజీ కళాశాలలో సమాచార హక్కు(స.హ.) చట్టం వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స.హ చట్టం గురించి స.హ. చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎం.ఎ.సలీం అవగాహన కల్పించారు. డెయిరీ అధ్యాపకులు కేవీ ఉమాపతి, పరిరక్షణ కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్, అలీమొద్దీన్, మదర్‌భాష, శ్రీకాంత్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిపాలనా బాధ్యతల స్వీకరణ

భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌లో నలుగురు అధ్యాపకులు మంగళవారం పరిపాలనా బాధ్యతలు స్వీకరించారు. బాలుర హాస్టల్ వార్డెన్‌గా డాక్టర్ యాలాద్రి, బాలికల హాస్టల్ వార్డెన్‌గా జి.సునీత, బాలికల సెల్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కె. వైశాలి, అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్ అధికారిగా డాక్టర్ సరితలు బాధ్యతలు స్వీకరించారు.

చిన్నారులకు ఫిజియోథెరపి

గాంధారి(ఎల్లారెడ్డి): ప్రత్యేకావసరాలున్న దివ్యాంగ చిన్నారులకు స్థానిక భవిత కేంద్రంలో మంగళవారం ఫిజియోథెరపి చేసినట్లు రీసోర్స్ టీచర్ పెంటయ్య తెలిపారు. పలువురు దివ్యాంగ చిన్నారులకు డాక్టర్ సారిక చికిత్స చేసి వారి తల్లిదండ్రులకు తగిన సలహాలు చేసినట్లు తెలిపారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మైలారం గ్రామంలో గల కొచ్చరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. అమ్మవారికి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరలేదు

దోమకొండ: తాము కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పత్రికల్లో పార్టీల నాయకులు చెప్పడం నిజం కాదని మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు మంగళవారం చెప్పారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీని మర్యాదపూర్వకంగా కలిశామే తప్ప పార్టీలో చేరలేదన్నారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధులు ఆశబోయిన పెద్ద చంద్రం, చిన్న చంద్రం, తిమ్మక్‌పల్లి నర్సింలు, తదితరులు ఉన్నారు.

హుండీ లెక్కింపు

దోమకొండ: మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారి హుండీని లెక్కించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాలకుర్తి శేఖర్ తెలిపారు. రెండు నెలల హుండీ ఆదాయం రూ.50,920 వచ్చినట్లు ఆయన వివరించారు. ఆలయ ఈవో ప్రభు, కమిటీ డైరెక్టర్లు రాజిరెడ్డి, నవీన్, రాజనర్సు, రైతుబంధు జిల్లా డైరెక్టర్ శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బోరెడ్డి నాగరాజ్‌రెడ్డి, నాయకులు సాయిరెడ్డి, అర్చకులు భావి శరత్ చంద్ర శర్మ ఉన్నారు.